క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన నేతలు



మాజీ సీఎం వైఎస్.జగన్‌ను కలిసిన పెదబాబు, కామేశ్వరరావు

గూడూరు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం గూడూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు, కంచాకోడూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు మేడా అంజిబాబు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ అధినేతకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని అధినేత సూచించినట్లు వారు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు వివరించారు.

ప్లాస్టిక్ రహిత నగరానికి సహకరించండి

మచిలీపట్నంటౌన్: ఉన్నతాధికారుల ఆదేశాలతో మచిలీపట్నం నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు సహకరించాలనికమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో బుధవారం ఆయన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఏ విధమైన ప్లాస్టిక్ క్యారీ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, అట్ట టీ గ్లాసులను (లోపల ప్లాస్టిక్ లామినేషన్‌తో కూడిన) అమ్మకం, వాడకం నిషేధించడం జరిగిందన్నారు. ఇకపై చట్ట ప్రకారం పెనాల్టీలు వేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు. కృష్ణాజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యం, వ్యాపారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మ్యాంగో కవర్లు అందిస్తాం

అవనిగడ్డ: మామిడిలో పురుగు ఆశించకుండా ఉండేందుకు ఉద్యాన శాఖ ద్వారా మ్యాంగో కవర్లు సబ్సిడీపై అందిస్తున్నట్టు ఉద్యానవన శాఖాధికారి ఎస్ రమేష్ చెప్పారు. బుధవారం ఆయన అవనిగడ్డ లంకలో మామిడితోటలను పరిశీలించారు. ఉద్యాన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ మామిడి కాయకులకు కవర్లు తొడగడం వల్ల కాయతొలుచు పురుగు, తెగుళ్ల నివారణతో పాటు అధికధర లభిస్తుందని చెప్పారు. కాయ నాణ్యత పెరుగుతుందని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఒక హెక్టారుకు పదివేల కవర్లు సబ్సిడీపై అందిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో కవర్ ఖరీదు రెండు రూపాయలు ఉండగా, ఒక రూపాయి సబ్సిడీ ఉంటుందన్నారు. కవర్లు కావాల్సిన వారు ఈనెల 25వ తేదీ లోపు దగ్గరలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలని సూచించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో కనకదుర్గ అమ్మవారి ఆలయ శిఖర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో సీజీఎస్ నిధులు రూ.18.33 లక్షలు, రూ.9.17 మ్యాచింగ్ గ్రాంట్, రూ.27.50 లక్షల భక్తుల విరాళాలతో దేవస్థాన పునఃప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు పూజలు చేశారు. తొలుత ఆలయ శిఖర ప్రతిష్ఠ, అనంతరం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. మహా పూర్ణాహుతి సమర్పించారు. దింటకుర్తి జ్యోతి ఆధ్వర్యంలో మహిళలు భగవద్గీత పారాయణం, అష్టలక్ష్మీ పారాయణం నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి గురుమూర్తి, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండలి వెంకట కృష్ణారావు(బాబు), ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పలువురు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

ఘంటసాల: ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని సీపీఎం సీనియర్ నేత వాకా రామచంద్రరావు అన్నారు. ఘంటసాల అంబేడ్కర్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి చైతన్య యాత్ర బుధవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొత్తూరు జయమ్మ ఏసీలు లేకపోయినా మాకు కరెంటు బిల్లు రూ.3 వేలు వచ్చిందని, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను సీపీఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలపై సచివాలయం, మండల అధికారులకు అర్జీలు ఇస్తామని, పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని రామచంద్రరావు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, సభ్యులు బలే రమేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి అండ

- ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలను ఆదుకుంది
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో నిర్వహణ
- పార్టీ జెండాలను ఆవిష్కరించి, కేక్‌లను కట్‌చేసిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు



పెడనలో కేక్ కట్ చేస్తున్న రాము, హారిక తదితరులు



అవనిగడ్డలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

పెడన: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో బుధవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. నాయకులు కేక్‌లను కట్ చేసి, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. 15 ఏళ్ల చరిత్ర కలిగిన వైఎస్సార్ సీపీ పేదలతో మమేకమై, వారి ఆర్థికాభివృద్ధికి విశేషంగా పాటుపడిందని, కష్ట కాలంలో కూడా కార్యకర్తలే పార్టీకి అండదండగా నిలిచారని, వారి వెన్నంటే పార్టీ ఉంటుందని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. బుధవారం పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీఈ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి రాము నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాము మాట్లాడుతూ గతంలో ఏపార్టీ చేయనంతగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు బండారు మల్లికార్జునరావు, కొండవీటి నాగబాబు, మున్సిపల్‌వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, రాజులపాటి అచ్చుతరావు, గరికపాటి వెంకటరామానాయుడు, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎంపీపీలు వెలివెల చినబాబు, కూనసాని గరుడప్రసాద్, కృత్తివెన్ను, గూడూరు జెడ్పీటీసీలు మైలా రత్నకుమారి, వేముల సురేష్‌రంగబాబు, పెడన పట్టణం, మండలం, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాలకు చెందిన కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా విభాగాలకు చెందిన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చల్లపల్లి: 15 ఏళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రారంభమైన వైఎస్సార్ సీపీని నేడు కోట్ల మంది ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుని అభిమానాన్ని చూపుతున్నారని, పార్టీకి కార్యకర్తలే పునాదిగా నిలబడి ప్రజా సేవలో ముందుకు నడిపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత సింహాద్రి రమేష్‌బాబు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ చల్లపల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు వెనిగళ్ల తారక జగదీష్ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి ప్రతి ఒక్కరికీ తినిపించి తన ఆప్యాయతను చాటుకున్నారు. జై జగన్ నినాదాలు చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, చల్లపల్లి మండల కన్వీనర్ శీలం వెంకట సత్యనారాయణ (నాని), పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్, నాయకులు మత్తి రాంబాబు, పాగోలు నాగసీతారామరావు (ఫణి), ఎస్సీ సెల్ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు, మద్దాల వీరాస్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేరుగు రమేష్, మైనార్టీ సెల్ నాయకులు హర్షద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: స్థానిక రామానాయుడుపేటలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఆవిష్కరించారు. పార్టీ జెండాకు నాయకులు, కార్యకర్తలు గౌరవ వందనం చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల ఆకాంక్షలను వమ్ముచేశారని దుయ్యబట్టారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ ముందుకు సాగుతోందన్నారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, మండల అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, అర్బన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జానీ), రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, పలువురు కార్పొరేటర్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో పార్టీ జెండాకు గౌరవ వందనం చేస్తున్న పేర్ని కిట్టు, నాయకులు, కార్యకర్తలు

నాగాయలంక: వైఎస్సార్ సీపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా గుడి సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. తొలుత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. సీనియర్ కార్యకర్తలైన గణపేశ్వరం సర్పంచ్ బెల్లంకొండ శ్రీనివాసరావు, పర్రచివర ఎంపీటీసీ సభ్యుడు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ(చిన్నారి), ఎదురుమొండి ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, మాజీ సర్పంచ్ దాసి జీవరత్నం, చిట్టా బాలపాపారావు, నంద్యాల కోటేశ్వరరావు, వనమాల రమేష్, తానంకి వేణుబాబు, బండ్రెడ్డి లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంటుమిల్లి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీపురం సెంటర్లో ఉన్న దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులకు మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. ఎంపీటీసీ పీ వీరబాబు, పార్టీ సీనియర్ నాయకులు తిరుమాని శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, జీవీ.రాజు, పీ. శివ, కే శ్రీనివాసరావు, పాము పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక ప్రధాన సెంటర్‌లో నేతలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వంతెన సెంటర్‌లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, నేతలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం నేతలందరూ మచిలీపట్నంలో యువత పోరు కార్యక్రమానికి ర్యాలీగా తరలివెళ్లారు.

ఘంటసాల: స్థానిక ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్ పార్టీ జెండాను ఆవిష్కరించగా నేతలు స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, నాయకులు దిరిశం పిచ్చేశ్వరరావు, జె.సోమసుందరరావు, యార్ల జనార్దన, అంగడాల నాగరాజు, గొర్రెపాటి గోపాలకృష్ణ, వేమూరి రాజబాబు పాల్గొన్నారు.

అవనిగడ్డ: ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ నిరంతర పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి వంతెన సెంటర్ వరకూ ర్యాలీగా వెళ్లి వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవి: స్థానిక ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం మండల పార్టీ అధ్యక్షుడు గరికిపాటి వెంకటేశ్వరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు. మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, ఎస్సీసెల్ మండల పార్టీ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు బండారు సూరిబాబు, రాయన సత్యనారాయణ, మాధవరావు, మత్తి సత్యనారాయణ, రెడ్రౌతు వెంకట రమణ, లింగం జగదీష్‌కుమార్, జన్యావుల రాము, నందిగం శ్రీనివాసరావు, గరికిపాటి వెంకటేశ్వరావు, పుప్పాల సతీష్, మత్తి రాజా, గొరిపర్తి గోవిందరాజులు, వాసు, తుటారం కృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో కేక్ కట్ చేస్తున్న సింహాద్రి రమేష్



బంటుమిల్లిలో ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ నాయకులు



చల్లపల్లి సెంటర్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



నాగాయలంకలో నాయకులు, పార్టీ శ్రేణులు



ఘంటసాల సెంటర్లో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



కోడూరులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న నేతలు, కార్యకర్తలు

యువత పోరులో కదం తొక్కిన శ్రేణులు



యువత పోరు ర్యాలీలో మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, నేతలు



దీక్షలో పేర్ని నాని, ఉప్పాల రాము, సింహాద్రి రమేష్ బాబు

చిలకలపూడి(మచిలీపట్నం)/మచిలీపట్నం టౌన్: యువత పోరు సందర్భంగా బుధవారం మచిలీపట్నం నగరం వైఎస్సార్ సీపీ శ్రేణులు, నిరుద్యోగులు, విద్యార్థులతో దద్దరిల్లింది. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. పేర్ని నాని నివాసం వద్ద జిల్లాలోని పలు నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావటంతో ఆ ప్రాంతం జనసందోహంగా మారింది. వీరంతా పేర్ని నాని నివాసం నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌కు తరలివచ్చారు. ర్యాలీ ప్రారంభించినప్పటి నుంచి పార్టీ జెండాలు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. గద్దె ఎక్కేముందు ఒక మాట..అధికారం వచ్చాక ఫీజులకు టాటా, చదువులకు ప్రాణసంకటం.. మా భవిష్యత్తుతో మీకు చెలగాటమా బాబు.. అంటూ పలు ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయరాదని నినాదాలు చేయటంతో నగర వీధులు హోరెత్తాయి.



యువత పోరుదీక్షలో మాట్లాడుతున్న మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు

పరీక్ష ప్యాడ్లు అందజేత

కోనేరుసెంటర్: శ్రీ సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు సమితి సభ్యులు ప్యాడ్‌లు, పెన్నులను ఉచితంగా అందజేశారు. బందరు మండలం వి.కానూరు హై స్కూలులో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు సరస్వతీ పూజను చేశారు. పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లను అందజేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అతిథిగా పాల్గొన్నారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు ఆంజనేయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈవన ఏసు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మల్లపరాజుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఈదర మధుమోహన్‌రెడ్డి ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు విద్యార్థులకు సుమారు రూ.5 వేల విలువ చేసే పరీక్ష కిట్లు (ప్యాడ్లు, జామెట్రీ బాక్స్, పెన్నులు, పౌచ్) అందజేసి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 123 మంది పదో తరగతి విద్యార్థులకు అవనిగడ్డ ఎస్‌వీఎల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు వితరణ చేశారు. సంస్థ కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ప్రిన్సిపాల్ ఎన్వీ నాగేశ్వరావు చేతులమీదుగా హెచ్.ఎం. పీవీఎన్‌వీ ప్రసాద్‌కు వీటిని అందజేశారు. స్టాఫ్ సెక్రటరీ గాజుల ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలు అందించాలి

ఘంటసాల: వరి, అపరాల్లో నూతన వంగడాలను అందించేందుకు కేవీకే శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహసంచాలకులు డాక్టర్ వి.విశాలక్షి అన్నారు. ఘంటసాల కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి ఆధ్వర్యంలో సహ పరిశోధన సంచాలకుల ఇన్‌చార్జి డాక్టర్ వి.శైలజ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. 2024- 25లో కేవీకే చేపట్టిన క్షేత్ర పరిశీలనలు, విస్తరణ, ప్రథమ శ్రేణి ప్రదర్శనలు, శిక్షణ, వాటి ఫలితాలను రైతులకు, శాస్త్రవేత్తలకు, అధికారులకు సుధారాణి వివరించారు. రైతుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కరపత్రాలను ఆవిష్కరించారు. 2025- 26 కార్యాచణ నివేదికలను వివరించారు. కృష్ణాజిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌వైవీఎస్ మనోహరరావు, జె.జ్యోతి, యు.నరసింహారావు, కె.జ్యోతి రమణి, డాక్టర్ వి.సత్యప్రియ లలిత, డాక్టర్ కె.నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా....

● 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' అమలు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడో శనివారం తప్పనిసరిగా అమలు చేసి స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, త్వరలో జరగనున్న కలెక్టర్ల సమావేశానికి కావాల్సిన అంశాలు, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై సూచనలు, సానుకూల ప్రజా దృక్పథం, పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) మోడల్ సర్వే తదితర అంశాలపై సీఎస్ కలెక్టర్లతో చర్చించారు. బందరు డీఎస్పీ చప్పిడి రాజా, డీఈవో పీవీజే రామారావు, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, డీపీఓ జె అరుణ, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు వీడియోకాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

● అదృశ్యమైన వృద్ధురాలు మృతి

చల్లపల్లి: అదృశ్యమైన వృద్ధురాలు విగతజీవిగా కనిపించిన ఘటన మండల పరిధిలోని పురిటిగడ్డలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామానికి చెందిన చోరగుడి బేబి(65) అనారోగ్యానికి గురికావటంతో లక్ష్మీపురం శివారు రామానగరానికి వచ్చింది. మందులు ఇచ్చి వైద్యులు పంపారు. అయితే బేబి ఇంటికి చేరలేదు. బేబి కుమారుడు చోరగుడి శ్రీనివాసరావు పాతనడకుదురులో ఉంటున్న తన సోదరి, బావలకు చెప్పాడు. అనంతరం శ్రీనివాసరావు చల్లపల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బుధవారం పురిటిగడ్డలో పొలం పనులు చేస్తున్న కూలీలకు, బేబి కుమార్తె సీతామహాలక్ష్మికి మృతదేశం కనిపించింది. దీంతో మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతిగా మార్చి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. పొలం వద్దనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

● అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

బోడగుంట(మోపిదేవి): బోడగుంట దళితవాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కొమ్ము బ్రహ్మయ్య కుటుంబం రోడ్డున పడింది. గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్(రాజా) దుప్పట్లు, దుస్తులు, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మోపిదేవి రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో హైజనిక్ కిట్, హెవీ టార్పాలిన్, పంటపాత్రలు ప్రభుత్వం తరపున స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఎంపీటీసీ కొమ్ము పవన్, అన్నపరెడ్డి వెంకటస్వామి, పూషడపు రత్నగోపాల్, కూరేటి రాఘవ, మత్తి వంశీ, కంఠంనేని మురళీకృష్ణ(టైర్‌బాబు), మోటుపల్లి పండు, రమేష్ పాల్గొన్నారు.

● ఆలయంలో చోరీ కేసు దర్యాప్తు ముమ్మరం

ఘంటసాల: మండలంలోని శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెం శ్రీకోదండ రామాలయంలో చోరీ కేసులో నిందితుల కోసం పోలీసులు నాలుగు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన శీలంవారిపాలెం రామాలయంలో జరిగిన రూ.4 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● ఫలితాలు విడుదల

కోనేరుసెంటర్(మచిలీపట్నం): బీఈడీ, స్పెషల్ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ బుధవారం విడుదల చేశారు. 1,348 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవగా 1,118 మంది ఉత్తీర్ణులయ్యారు. 82.94 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు వీసీ అభినందనలు తెలిపారు. పునఃమూల్యాంకనం కోసం ఈ నెల 25వ తేదీలోగా వెబ్‌సైట్‌లో సూచించిన రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.వీరబ్రహ్మాచారి సూచించారు. రెక్టార్ ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పాఠంలో కొత్తదనం తెలుసుకుని బోధించాలి

పెడన: పాఠంలో కొత్త దనం కనుగొని, సులభమైన పద్ధతిలో బోధించాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఫణిధూర్జిటి అన్నారు. బుధవారం మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలో స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. నందమూరు జెడ్పీహెచ్‌ఎస్‌లోని సమావేశాన్ని ఏపీసీ ఫణిధూర్జిటి ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. క్లస్టర్ కాంప్లెక్స్ రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ఎంఈవో-2 హారనాథ్ మాట్లాడారు. సెక్టొరల్ అధికారులు రమేష్, రాంబాబు, రామకృష్ణ, పాఠశాలల్లో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు సౌజన్య, విజయ కుమారి, ప్రభాకర్, నాగేశ్వరరావు, అశోక్ కుమార్‌లు క్లస్టర్ చైర్మన్లుగా వ్యవరించారని ఎంఈవో తెలిపారు.

● అపార జ్ఞాన సంపన్నుడు గొర్రెపాటి పార్థసారధి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): అపార జ్ఞాన సంపన్నుడు గొర్రెపాటి పార్థసారధి అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. పెదకళ్లేపల్లిలో ఇటీవల మృతి చెందిన దానశీలి పార్థసారధి సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. తొలుత పార్థసారధి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్, మండల వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, అరజా కిరణ్‌కాంత్, గొర్రెపాటి దుర్గానాగేశ్వరావు పాల్గొన్నారు.

● ప్రముఖ అంకాలజిస్టు దత్తాత్రేయుడుకు సత్కారం

మచిలీపట్నంటౌన్: ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడును స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. డాక్టర్ దత్తాత్రేయుడు నగరంలోని ఆయన బంధువుల గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బృందావనం శ్రీనివాసాచార్యులు, మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేవీ శివప్రసాద్ ఇతర సభ్యులు దత్తాత్రేయుడును కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తనకు విద్యాదానం చేసిన బందరును ఎన్నటికీ మర్చిపోనన్నారు.